నదిలో చేపల వేటకు దిగితే చర్యలు తప్పవు

రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ


మత్స్యకారులతో చర్చిస్తున్న రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ వెంకటేశ్వరరావు

కొల్లూరు: కృష్ణా నదిలో చేపల వేట వివాదాలు పరిష్కారమయ్యే వరకు మత్స్యకారులు నదిలో చేపల వేటకు దిగితే చట్టపరమైన చర్యలు తప్పవని రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ హెచ్చరించారు. కొల్లూరు పోలీసు స్టేషన్‌లో మండలంలోని గాజుల్లంక, పోతార్లంక గ్రామాలకు చెందిన మత్స్యకారులతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. చేపల వేట విషయంలో చోటుచేసుకున్న వివాదాలపై విచారణ చేపట్టారు. ఇరు గ్రామాల మత్స్యకారుల ఘర్షణలకు కారణమైన నిషేధిత వలల వినియోగంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారులు మత్స్యశాఖ నిషేధించిన వలలను వినియోగిస్తున్నట్లు నిర్ధారణకు వచ్చారు. సమస్య సర్దుమణిగే వరకు నదిలో రెండు గ్రామాల మత్స్యకారులు చేపల వేటను నిలిపివేయాలని ఆదేశించారు. మత్స్యశాఖ మంజూరు చేసే చేపల వేట లైసెన్స్ ఇరు గ్రామాల మత్స్యకారులకు ప్రస్తుత ఏడాదికి లేకపోవడం ఆయన దృష్టికి రావడంతో అనుమతులు లేకుండా చేపల వేట సాగించకూడదని స్పష్టం చేశారు. మత్స్యకారులు సఖ్యతగా చేపల వేట చేసుకునేందుకు ప్రయత్నించాలని సూచించారు. గతంలో అధికారుల సమక్షంలో ఇరు వర్గాలు చేసుకున్న ఒప్పందాలను అతిక్రమించి, చేపల వేట సాగిస్తూ.. కొట్లాటలకు దిగితే కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో వేమూరు సీఐ వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ ఏడీ పి.గాలిదేముడు, తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో దళిత, గిరిజనులకు తీరని అన్యాయం


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్


కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న యువకులు

పిట్టలవానిపాలెం: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాజిక న్యాయానికి అన్యాయం చేసినట్లుగా ఉందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి బాపట్ల జిల్లా కన్వీనర్ కె.శరత్‌బాబు విమర్శించారు. మండలంలోని మండేవారిపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం గ్రామస్తులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో దళిత, గిరిజనుల అభివృద్ధికి తగిన విధంగా కేటాయింపులు ఆశించామని అయితే అలాంటి అవకాశం కనిపించలేదని ఆరోపించారు. గతేడాది దళితుల అభివృద్ధికి రూ. 1819.12 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈ ఏడాది రూ.976.86 కోట్లు మాత్రమే నిధులు కేటాయించడం విచారకరమన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో యు.అశోక్, బి.దినేష్, సీహెచ్ కార్తీక్, ఎం.వర్ధన్, ఎం.రాహుల్, జి.మధు తదితరులు ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచెయ్యి

రేపల్లె: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి మొండిచేయి చూపిందని, ఇది అభివృద్ధి నిరోధక బడ్జెట్ అని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ ఆరోపించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. సామాన్యులకు కోతలు, సంపన్నులకి సంపదలు అన్న చందంగా కేంద్ర బడ్జెట్ ఉందని దుయ్యబట్టారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల ఊసే ఎత్తలేదని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిని అదానికి బీజేపీ తాకట్టుపెట్టిందని మండిపడ్డారు. విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ ప్రస్తావన కూడా లేదన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కర్ణాటకకు ప్రత్యేక కేటాయింపులు చేసిన కేంద్రం.. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. సమావేశంలో సీపీఎం నేతలు కె.రమేష్, జి. ధర్మరాజు, బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని.. విరిగిన విద్యుత్తు స్తంభం




కొల్లూరు: లారీ ఢీకొని విద్యుత్తు స్తంభం విరగడంతో విద్యుత్ సరఫరాకు గురువారం అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనలో పెను ప్రమాదం తప్పింది. మండలంలోని ఆవులవారిపాలెంలో బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ.. స్థానిక రాములవారి ఆలయం వద్ద మలుపులో ఉన్న విద్యుత్తు ఇనుప స్తంభానికి తగిలింది. లారీ వెనుక చక్రం స్తంభానికి పట్టుకోవడంతో అక్కడే ఉన్న యువకులు గమనించి డ్రైవర్‌ను అప్రమత్తం చేసినా ముందుకెళ్లాడు. స్తంభం సగానికి పైగా విరిగి పోయి తీగల ఆధారంతో కాసరంను ఆసరాగా చేసుకుని వేలాడింది. స్తంభం విరిగిన ధాటికి వైర్లు తెగిపడినట్లయితే ఆ ప్రాంతంలో ఉన్న స్థానికులు, లారీ డ్రైవర్ ప్రాణాలకు ప్రమాదం వాటిల్లి ఉండేది. ఈ ఘటనలో సుమారు రూ.32 వేల వరకు నష్టం, లంక గ్రామాలకు సుమారు 8 గంటల పాటు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆ శాఖ సిబ్బంది శ్రమించి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. పోల్ విరగడానికి కారణమైన లారీ డ్రైవర్‌పై కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఏఈ సుధాకర్‌బాబు తెలిపారు.

జనవరి పండుగలో ఘర్షణ.. కేసులు నమోదు

కొల్లూరు: జనవరి పండుగ సందర్భంగా జరిగిన పాటల కచ్చేరీలో చోటు చేసుకున్న ఘర్షణలో ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు కొల్లూరు ఎస్ఐ శామ్యూల్‌రాజీవ్‌కుమార్ గురువారం తెలిపారు. గత నెల 31న అర్ధరాత్రి మండలంలోని జువ్వలపాలెంలో జనవరి పండుగను పునస్కరించుకుని ఊరేగింపులో పాటల కార్యక్రమం నిర్వహించారు. పాటల విషయంలో భూపతి రవితేజ, దోవ వంశి మధ్య వివాదం పెరిగి ఘర్షణకు దారితీసింది. ఒకరిపై ఒకరు తమ అనుచరలతో దాడులకు పాల్పడ్డారు. పలువురు గాయపడ్డారు. క్షతగాత్రులు తెనాలి వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వైద్యశాల నుంచి అందిన నివేదిక ఆధారంగా ఇరు వర్గాలకు చెందిన దోవ వంశి, దోవ వెంకటేశ్వరరావు, శ్యామ్, భూపతి రవితేజ, భూపతి వెంకటేశ్వరరావు, భూపతి ఆదిత్యపై కేసులు నమెదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఏఎన్‌యూ హ్యాండ్‌బాల్ జట్టుకు ఏడుగురు ఎంపిక


కాలేజి హ్యాండ్‌బాల్ జట్టుతో ఎమ్మెల్యే శివకుమార్, రామ్‌చంద్

తెనాలి: దక్షిణ మండల అంతర విశ్వవిద్యాలయాల హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఆచార్య నాగార్జున యూనివర్శిటీ జట్టుకు స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి క్రీడాకారులు ఏడుగురు ఎంపికయ్యారు. తమిళనాడు రాష్ట్రం సేలంలోని పెరియార్ యూనివర్శిటీలో ఈనెల 4వ తేదీ నుంచి ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. కాలేజి క్రీడాకారులు కొనసాయి కిరణ్, కడగాల ప్రభుదేవ, బగాది మనోజ్‌సాయి, గొల్లవిల్లి పవన్‌కుమార్, కందుల చందు, ఆకునూరి చందు, కొట్టాడ శ్రీనివాసరావు యూనివర్శిటీ జట్టులో ఆడనున్నారు. ఈనెల 23-24 తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్శిటీలోని కాలేజి ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ స్పోర్ట్స్ సైన్సెస్ ఆధ్వర్యంలో అంతర కళాశాలల హ్యాండ్‌బాల్ పోటీలు జరిగాయి. వీటిలో ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి జట్టు ఓవరాల్ టీం ఛాంపియన్‌షిప్‌ను రెండో పర్యాయం గెలుచుకోవటం విశేషం. ఆ జట్టులో ప్రతిభను ప్రదర్శించిన క్రీడాకారులను ఆచార్య నాగార్జున జట్టుకు ఎంపికచేశారు. ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ క్రీడాకారులను అభినందించారు.

వీడియో సాంగ్ షూటింగ్



తెనాలిఅర్బన్: ది స్ట్రేంజ్ డ్రీమర్స్ బ్యానర్‌పై రూపొందిస్తున్న మాస్టార్ మాస్టార్ వీడియో సాంగ్ షూటింగ్‌ను గురువారం చినరావూరులోని సోమేశ్వరస్వామి దేవస్థానంలో ప్రారంభించారు. నటీనటులపై టెలిఫిలిమ్ దర్శకుడు కనపర్తి రత్నాకర్ క్లాప్ కొట్టారు. అనంతరం పలు సన్నివేశాలను చిత్రీకరించారు. కార్యక్రమంలో కిరణ్ కొండ్రు దర్శకత్వం వహించగా, హిరో హిరోయిన్లుగా బబులు చెర్రీ, కావ్యాలు నటిస్తున్నారు.

రైలు నుంచి జారి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు నుంచి జారి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తెనాలి రైల్వే స్టేషన్ వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సుమారు 55 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి తెనాలి రైల్వే స్టేషన్ దక్షిణ క్యాబిన్ సమీపంలో పట్టాల మధ్య మృతి చెంది ఉన్నాడన్న సమాచారంతో జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని గురువారం పరిశీలించారు. మృతదేహం పూర్తిగా ఛిద్రమై ఉంది. నల్లప్యాంటు ధరించి ఉన్నాడు. జేబులో బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు తెనాలి నుంచి నెల్లూరుకు తీసుక్న టికెట్ ఉంది. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

నగరం: గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తహసీల్దారు ఎం.శ్రీనివాసరావు ఆదేశించారు. మండలంలోని అద్దంకివారి పాలెం గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తియ్యేలా సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని, రేషన్ షాపులను తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కొలగాని వారి పాలెం గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనులను, సచివాలయాన్ని ఎంపీడీవో ఎస్. రాధారమణ తనిఖీ చేశారు.

కోడిపందేల స్థావరంపై దాడి


సెబ్ సిబ్బంది అదుపులో కోడి పందెం నిర్వాహకులు

భట్టిప్రోలు: బాపట్ల అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు రేపల్లె సెబ్ సీఐ శ్రీనివాసులు, సిబ్బంది కోడి పందేలు నిర్వహిస్తున్న ప్రాంతాల్లో గురువారం దాడులు చేశారు. మండలంలోని పెద పులివర్రు గ్రామ శివారు బుసకలంక సమీపంలోని పెదపాలెం పంట పొలాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కోళ్లు, రెండు ద్విచక్ర వాహనాలు, రూ.3 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని శుక్రవారం కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

నిందితులను తక్షణం అరెస్టు చేయాలి


దాడిలో గాయపడిన వ్యక్తులకు పరామర్శ

కొల్లూరు: నది పరీవాహక భూముల విషయంలో తలెత్తిన ఘర్షణలో ఎస్సీ వర్గీయులపై దాడి చేసిన వారిని తక్షణం అరెస్టు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘాల రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు, కె.హరిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని చింతర్లంకలో జరిగిన ఘర్షణలో స్వల్పంగా గాయపడిన వారిని గురువారం పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. దాడి చేసిన వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు, 307 సెక్షన్ కింద కేసు నమోదు చేయాలన్నారు. చింతర్లంక, పెదలంక గ్రామాలకు చెందిన ఎస్సీలకు రక్షణ కల్పించడంతోపాటు, జిల్లాస్థాయి నాయకులు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ గ్రామంలో పర్యటించి తగిన న్యాయం జరిగేలా చూడాలన్నారు.

అప్రమత్తంగా ఉన్నప్పుడే రోడ్డు ప్రమాదాల నివారణ

బాపట్లటౌన్: డ్రైవర్లు అప్రమత్తంగా ఉన్నప్పుడే రోడ్డు ప్రమాదాలను పూర్తి స్థాయిలో నివారించవచ్చని డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ గ్యారెజ్‌లో గురువారం జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రైవర్లు బస్సులను నడిపే సమయంలో ఏకాగ్రతతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మోటారు వాహనాల తనిఖీ అధికారి డి.రంగారావు, జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ వై.విజయ్ కుమార్‌రెడ్డి, బాపట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ టి.అజితకుమారి పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

బాపట్లటౌన్: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమైన ఘటన పట్టణంలోని వెంగళవిహార్‌లో గురువారం జరిగింది. చింత సుదేవ్‌కు చెందిన పూరిల్లు మంటలు చెలరేగి అగ్నికి ఆహుతైంది. ఈ విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. అప్పటికే ఇల్లు పూర్తిగా కాలిపోయింది.

పైప్‌లైన్ పనులు వెంటనే పూర్తి చేయాలి


అధికారులకు సూచనలిస్తున్న ప్రత్యేక అధికారి హనుమంతరావు, పక్కన ఎంపీపీ, జడ్పీటీసీ

భట్టిప్రోలు: భట్టిప్రోలు వైఎస్సార్ జగనన్న లే అవుట్‌లో పైప్‌లైన్ పనులు పూర్తి కాకపోవడంతో గృహ నిర్మాణంలో ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు మండల ప్రత్యేకాధికారి డాక్టర్ జె. హనుమంతరావు దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీపీ దావూరి వెంకటలలిత కుమారి, జడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావుతో కలసి గురువారం ఆయన కాలనీని సందర్శించారు. కాంట్రాక్టర్ పైప్‌లైన్ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో గృహ నిర్మాణాలు పూర్తి కాలేదని నిర్ధారణకు వచ్చారు. వెంటనే కాంట్రాక్టర్‌తో మాట్లాడి.. పనులు పూర్తి చేయించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాగర్‌ను ఆదేశించారు. అనంతరం భట్టిప్రోలు-1 సచివాలయాన్ని సందర్శించారు. రెగ్యులర్ సెక్రటరీ లేకపోవడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నట్లు గమనించడం జరిగిందని తెలిపారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పంచాయతీ రాజ్ ఏఈ శేతు రామచంద్ర రావు, ఇన్‌చార్జి సెక్రటరీ ఎ.రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి


సచివాలయంలో రిజిష్టర్ పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ శరత్‌బాబు

ఏట్రవారిపాలెం(కర్లపాలెం): ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని డీఎల్‌పీఓ పీడీఎస్ శరత్‌బాబు పేర్కొన్నారు. ఏట్రవారిపాలెం సచివాలయాన్ని ఆయన గురువారం తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడారు. స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందే విధంగా సిబ్బంది పనిచేయాలని స్పష్టం చేశారు. సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ భవనాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.పద్మావతి పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం


అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీడీవో పరిశీలన

పెదలంక(భట్టిప్రోలు): మండలంలోని పెదలంక-1 అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా, అంగన్‌వాడీ కార్యకర్త విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జడ్పీటీసీ తిరువీధుల ఉదయ భాస్కరి ఆరోపించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావుతో కలసి వారు గురువారం పరిశీలించారు. ఆయా అందుబాటులో లేదని, రిజిస్టర్‌లో సంతకం కూడా చేయలేదని గుర్తించినట్లు చెప్పారు. కేంద్రంలో ఉండాల్సిన సరుకులకన్నా అధికంగా ఉన్నాయని, మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని.. చిన్నారులు చెప్పిన దానికి సిబ్బంది వివరణకు పొంతన లేదని, మెనూ చార్ట్, కేంద్రాన్ని సూచించే బోర్డు లేవని.. తమ పరిశీలనలో గమనించినట్లు తెలిపారు. ఈ విషయమై అమృతలూరు సీడీపీవో కె.విజయలక్ష్మిని వివరణ కోరగా అంగన్‌వాడీ సిబ్బందికి మెమో ఇచ్చినట్లు సమాధానం చెప్పారు. ఇటువంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎంపీటీసీ నన్నెపాముల చంటి, పంచాయతీ కార్యదర్శి పుష్పలత, మహిళా పోలీస్ ఎం.శిరీష, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాల దృష్టికి మాజీ సైనికుల సమస్యలు


సమావేశంలో మాట్లాడుతున్న బ్రిగేడియర్ వెంకటరెడ్డి

రేపల్లె రూరల్: మాజీ సైనిక ఉద్యోగులకు కల్పించాల్సిన సౌకర్యాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించాలని బ్రిగేడియర్ వెంకట రెడ్డి కోరారు. మాజీ సైనికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పట్టణంలోని మత్స్యకార భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సైనిక ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని.. ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో అన్ని జిల్లాలో సమావేశాలు నిర్వహించి, సమస్యలు గుర్తిస్తున్నట్లు తెలిపారు. రేపల్లె తాలూకా పరిధిలోని మాజీ సైనిక ఉద్యోగులు పలు సమస్యలను తెలియజేశారు. బాపట్ల క్యాంటీన్‌లో నిత్యావసరాలు, ఇతర వస్తువులు అందుబాటులో ఉండటం లేదని, ఆరోగ్య పరమైన ఇబ్బందులు ఎదురైతే.. గుంటూరు, విజయవాడ వంటి పట్టణాలకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. డివిజన్ కేంద్రాల్లో క్యాంటిన్‌లను ఏర్పాటు చేసి, వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని పలువురు సైనికులు కోరారు. ఈ కార్యక్రమంలో సైనిక ఉద్యోగుల వెల్ఫేర్ ఆఫీసర్ షీలా, ఉద్యోగుల సంఘం నాయకులు సుభాని తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని అందించాలి


ఆముదాలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శిరీష

నిజాంపట్నం: పౌష్టికాహారాన్ని బాలింతలకు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించాలని తహసీల్దార్ శిరీష పేర్కొన్నారు. మండలంలోని ఆముదాలపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శిరీష మాట్లాడారు. ప్రభుత్వ మెనూ ప్రకారం ఖచ్చితంగా పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ఆహారాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్త పరిచారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీ ప్రసన్న, సర్పంచ్ నర్రా వెంకమ్మ తదితరులున్నారు. అనంతరం సచివాలయం, ఎంపీయూపీ పాఠశాలలో తనిఖీలు నిర్వహించి, రికార్డులు పరిశీలించారు. మండలంలోని ముత్తుపల్లి అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయం, పాఠశాలను ఎంపీడీవో నాగలక్ష్మి తనిఖీ చేశారు. అంగన్‌వాడీలో పౌష్టికాహారాన్ని పరిశీలించారు. సచివాలయంలో రికార్డులు పరిశీలించారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

పిట్టలవానిపాలెం: వైఎస్సార్ బీమాతో ధీమాగా ఉండవచ్చని ఎంపీపీ షేక్ బాజీ పేర్కొన్నారు. మండలంలోని చందోలు శివారు రసూల్ పేటకు చెందిన ఎస్కే రబ్బాని ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా కింద రూ.10 వేల నగదును గురువారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ నాయకులు మునీర్, గ్రామ కార్యదర్శులు శేషగిరిరావు, బోయిన వీరేంద్ర ఉన్నారు.

సర్వేకు సహకరించాలి

రేపల్లె: ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీకి.. హెల్త్ సెక్రటరీలు, వలంటీర్లు నిర్వహించే ఇంటింటి సర్వేకు పట్టణ ప్రజలు తమ వివరాలు అందించి, సహకరించాలని మున్సిపల్ కమిషనర్ విజయసారథి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు పొందిన వారు రూ.5లక్షల వరకు ఉచిత ఆరోగ్య సేవలు పొందవచ్చని తెలిపారు.

క్లుప్తంగా

ఖాజీపాలెంలో వైద్య సేవలు

పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం గ్రామంలో 104 వాహన సిబ్బంది గురువారం వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ లోకేష్ మాట్లాడారు. నెలలో ఒక రోజు గ్రామ సచివాలయం వద్ద వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం దీర్ఘకాలిక రోగులు, మంచం నుంచి లేవలేని వారి ఇంటికే వెళ్లి వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. మొత్తం 60 మంది రోగులను పరీక్షించి మందులు అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం అనిత, సాయికిషోర్, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ప్రతి గురువారం కార్యాలయాల తనిఖీ

వేమూరు: సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందని రేపల్లె ఆర్డీఓ పార్థసారథి పేర్కొన్నారు. వేమూరు మండల కేంద్రంలోని గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేయాలని సూచించారు. అంబేడ్కర్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారం సక్రమంగా అందించకపోతే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. రేపల్లె డివిజన్ పరిధిలో ప్రతి గురువారం ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యల్లమాటి మోహనరావు, డిప్యూటీ తహసీల్దారు రాజా రమేష్, ఆర్ఐ వెంకటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాపట్ల జిల్లాగా ఆధార్ చిరునామాను మార్చుకోండి

పిట్టలవానిపాలెం: గ్రామ సచివాలయాల్లో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల డీఎల్‌డీఓ చంద్ర సువార్త పేర్కొన్నారు. మండలంలోని పిట్టువారిపాలెం గ్రామ సచివాలయాన్ని ఆమె గురువారం తనిఖీ చేశారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ సువార్త మాట్లాడారు. ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు భవనంవారి పాలెం, గోకరాజునల్లిబోయినవారి పాలెం గ్రామ సచివాలయాల్లో ఆధార్ సర్వీసులను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని కోరారు. ఫోన్ నంబర్ లింక్ చేయించుకుని ఇప్పటి వరకు గుంటూరు జిల్లాగా ఉన్న చిరునామాను బాపట్ల జిల్లాగా మార్పు చేయించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఎంపీడీఓ కె.పద్మజ, గ్రామ కార్యదర్శులు ఐనంపూడి శ్రీనివాసరావు, వసుంధర లక్ష్మి, శ్రీనివాసరావు, సుజాత, శేషగిరిరావు, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

'ప్రతిభ' చాటిన ఐలవరం విద్యార్థులు



ఐలవరం(భట్టిప్రోలు): పవిత్ర వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి 7వ వార్షిక ప్రతిభ పరీక్షలో మండలంలోని ఐలవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. బీవీఎల్ పద్మజ(6వ తరగతి) ప్రథమ స్థానం, ఎస్కే మసూద్(7వ తరగతి) ద్వితీయ స్థానం, జె.సాహితి(8వ తరగతి) నాలుగో స్థానం, బి.లోహిత గిరిజ కన్సోలేషన్, మెమెంటో అందుకున్నారు. గురువారం పాఠశాలలో విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు కాటూరు లక్ష్మీనారాయణ అభినందించారు. ఉపాధ్యాయులు నారాయణ, రవిరామ కిషోర్, పీఈటీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

రేపల్లె రూరల్: మండలంలోని పోటుమెర గ్రామ సచివాలయాన్ని మండల ప్రత్యేక అధికారి విలియమ్స్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన వెంట సీఎస్‌డీటీ వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ముత్తెంశెట్టిపాలెంలో బైక్ దగ్ధం

తెనాలిరూరల్: పట్టణ ముత్తెంశెట్టిపాలెంలో బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. రోడ్డు వెంబడి నిలిపి ఉన్న బైక్‌కు నిప్పంటించి పరారయ్యారు. బైక్ నుంచి మంటలు చెలరేగడాన్ని గమనించిన యజమాని మంటలను ఆర్పి పోలీసులను ఆశ్రయించాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేద గిరిజనులకు చీరలు పంపిణీ

తెనాలిఅర్బన్: ట్రైబల్స్ చారిటబుల్ ఇండియా సంస్థ అధినేత రావూరి అంజలి ఆధ్వర్యంలో వీఎస్సార్ కళాశాల ఎదురుగా కాల్వకట్టపై నివసిస్తున్న పేద గిరిజనులకు గురువారం చీరలను పంపిణీ చేశారు. అలాగే భోజనం ప్యాకెట్లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ రావూరి సురేష్‌బాబు, సభ్యులు బొంత కృపమ్మ, అద్దంకి పద్మ పాల్గొన్నారు.